ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY



జయశంకర్ భూపాలపల్లి ములుగు

శనివారం 10 ఫిబ్రవరి 2024

నిధులు గలగల పారేనా?



- రాష్ట్ర బడ్జెట్‌పై ఉమ్మడి జిల్లావాసుల ఆశలు
- కాళేశ్వరం ప్రాజెక్టుకు కేటాయింపుపై సందిగ్ధం
- హెల్త్‌సిటీకి నిధులు అనుమానమే?
- మామునూరు ఎయిర్‌పోర్టుకు నిధులపై ఆశలు
- మేడారం జాతరకు వరాలు ప్రకటించే అవకాశం
- నేడు అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న డిప్యూటీ సీఎం



హనుమకొండ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో శనివారం ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌పై ఉమ్మడి జిల్లా ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఈ బడ్జెట్‌లో ఏ మేరకు నిధులు కేటాయిస్తోందోనని ఆశగా ఎదురుచూస్తున్నారు. జిల్లాలలోని పలు సమస్యల శాశ్వత పరిష్కారానికి, సమగ్రాభివృద్ధికి చేపట్టవలసిన పనులు, అర్ధాంతరంగా ఆగిపోయిన ప్రాజెక్టులు, పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలకు కార్యరూపం ఇవ్వాలంటే ప్రభుత్వం బడ్జెట్‌లో చాలినన్ని నిధులను కేటాయించాల్సిన అవసరం ఉన్నది. ఈదృష్ట్యా బడ్జెట్‌లో కేటాయింపులు ఎలా ఉంటాయన్న చర్చ జరుగుతోంది.

కాళేశ్వరం నిధులు..?

భూపాలపల్లి జిల్లా పరిధిలోని కాళేశ్వరం ప్రాజెక్టు వివాదంలో చిక్కుకున్న నేపథ్యంలో ఈ ప్రాజెక్టుకు ఈసారి ప్రభుత్వం ఏ మేరకు నిధులు కేటాయిస్తుందన్న విషయంలో సందిగ్ధం నెలకొన్నది. గత బీఆర్‌ఎస్ సంవత్సరం ఈ ప్రాజెక్టు నిర్వహణకు పెద్దగా నిధులు కేటాయించలేదు. కాళేశ్వరం టూరిజం సర్క్యూట్ కోసం మాత్రం రూ.750 కోట్లను బడ్జెట్‌లో కేటాయించింది. కానీ ఒక్కపైసా కూడా విడుదల కాలేదు. కొత్త ప్రభుత్వం ఈ టూరిజం సర్క్యూట్ ప్రాజెక్టును కొనసాగిస్తుందా? నిధులు కేటాయిస్తుందా? అన్నదానిపై సందిగ్ధం నెలకొన్నది. అలాగే ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని దేవాదుల, శ్రీ రాంసాగర్ తదితర ప్రాజెక్టులకు ఏ మేరకు బడ్జెట్‌లో పద్దులుంటాయోనన్న చర్చ జరుగుతోంది.

మెగా టెక్స్‌టైల్ పార్క్

గీసుగొండ, శాయంపేట మండలాల పరిధిలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ పనులు కుంటినడక నడుస్తున్నాయి. మౌలిక సదుపాయాల కల్పనకు నిధుల కొరతను ఎదుర్కొంటోంది. ఈ బడ్జెట్‌లో ఏ మేరకు నిధుల కేటాయింపు జరుగుతుందో చూడాలి. గత బడ్జెట్‌లో ప్రాతిపదిక సదుపాయల కల్పనకు రూ.160కోట్లు మాత్రమే కేటాయించారు. ఈ బడ్జెట్‌లో ఎక్కువ నిధులు కేటాయింపు జరగవచ్చునని ప్రజలు ఆశిస్తున్నారు.

హెల్త్ సిటీ

వరంగల్ పాత సెంట్రల్ జైలు స్థలంలో హెల్త్ సిటీ ప్రాజెక్టులో భాగంగా కొత్తగా నిర్మిస్తున్న బహుళ అంతస్తుల సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రికి కూడా ఏమేరకు నిధుల కేటాయింపు జరుగుతుందో చూడాలి. గత ప్రభుత్వం రూ. 1100 కోట్ల వ్యయంతో నిర్మాణం చేపట్టిన విషయంలో కూడా వివాదం తలెత్తిం ది. ఈ ఆస్పత్రి స్థలాన్ని గత ప్రభుత్వం బ్యాంకులో కుదువబెట్టి రూ.2వేల కోట్లు తీసుకున్నదని, పైగా ఆస్పత్రి పనులు నాసిరకంగా జరుగుతున్నాయని ప్రభుత్వం విమర్శిస్తోంది. ఈ పరిస్థితుల్లో దీనికి బడ్జెట్‌లో ప్రభుత్వం ఏ మేర కు నిధులు ఇస్తుందోనని ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అలాగే మామునూరు ఎయిర్‌పోర్టును అభివృద్ధి చేయనున్నట్టు ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి


మిగతా 4వ పేజీలో..



పులకించిన పుట్టి పెరిగిన నేల

మన పీవీ.. ఇక భారతరత్నం..

- మరణానంతరం 20 ఏళ్లకు దక్కిన గౌరవం
- ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా హర్షాతిరేకాలు
- బహుభాషా కోవిదుడు, ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు
- అంచెలంచెలుగా ప్రధాని స్థాయికి ఎదిగిన పీవీ



వరంగల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : లక్నేపల్లి గడ్డపై పుట్టి. వంగర నేలపై పెరిగిన మన పీవీ నర్సింహరావుకు భారతరత్న పురస్కారం లభించింది. ఈ మేరకు గురువారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ట్విట్టర్ ఎక్స్‌లో పీవీకి భారతరత్న పురస్కారంపై పోస్టు చేశారు. మారుమూల ప్రాంతంలో పుట్టిన పీవీ ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ దేశ అత్యున్నత పురస్కారమైన భారతరత్నను పొందటంతో ఓరుగల్లు ప్రజల్లో హర్షం వ్యక్తంఅవుతోంది. రాజనీతిజ్ఞుడు, బహుబాషా కోవిదుడు, సంస్కరణలకు ఆద్యుడుగా పిలిచే పీవీ నర్సింహరావు. తన జీవితంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని భారతరత్నంగా నిలిచారు. ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగుపెట్టి.. ప్రధానిగా పార్లమెంట్‌లో నిలిచి తెలుగు తేజస్సును దశదిశలా చాటిన మహోన్నత వ్యక్తి.

లక్నేపల్లిలో పుట్టి... వంగరలో పెరిగి..

వరంగల్ జిల్లా నర్సంపేట మండలం లక్నేపల్లి గ్రామంలో 1921 జూన్ 28వ తేదీన రుక్మాబాయి, సీతారామారావు దంపతులకు పీవీ నర్సింహరావు జన్మించారు. ఇదే ప్రాంతంలో ప్రాథమిక విద్యను అభ్యసించారు. అయితే ఐదేళ్లకే అప్పటి కరీంనగర్ జిల్లా (ప్రస్తుత హనుమకొండ జిల్లా) భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి చెందిన పాములపర్తి రంగారావు, రుక్మిణమ్మ దంపతులు పీవీని దత్తత తీసుకున్నారు. అప్పటి నుంచి పాములపర్తి వెంకట నర్సిం హరావుగా మారారు. హుజూరాబాద్‌లో పాఠశాల, హనుమకొండలో కళాశాల విద్యను పూర్తి చేశారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఎల్‌ఎల్‌బీ చదువు తుండగానే నిజాం సర్కారుకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమంలో కాంగ్రెస్ నేతలతో పాల్గొన్నారు. 1938లో హైదరాబాద్ రాష్ట్ర కాంగ్రెస్‌లో చేరారు. అప్పటి నిజాం ప్రభుత్వం నిషేధించిన వందేమాతరం గేయాన్ని పాడటంతో యూనివర్సిటీ నుంచి పీవీని బహిష్కరించారు. ఆ తరువాత నాగపూర్‌లోని ఓ మిత్రుడి సహాయంతో 1940 నుంచి 1944 వరకు ఎల్‌ఎల్‌బీ చదివారు. హైదరాబాద్‌కు తిరిగి వచ్చిన పీవీ.. కాకతీయ పత్రికను స్థాపించి జయ అనే మా రుపేరుతో వ్యాసాలు రాస్తూ నిజాంపై పోరాటాన్ని కొనసాగించారు. స్వామి రామానంద తీర్థ, బూర్గుల కృష్ణారావుల అనుచరుడిగా స్వాతంత్ర్యోద్యమంలో పీవీ పాల్గొన్నారు. 1951లో ఏఐసీసీ సభ్యుడిగా పీవీ పదవి లభించింది. కాగా, పీవీ నర్సింహరావు సతీమణి సత్యమ్మరావు 1970 జూలై 1న మృతి చెందారు. వీరికి ముగ్గురు కుమారులు, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. వీరిలో మాజీ మంత్రి పీవీ రంగారావు పెద్ద కుమారుడు కాగా, సికింద్రాబాద్ మాజీ ఎంపీ పీవీ రాజేశ్వర్‌రావు, పీవీ ప్రభాకర్‌రావులు ఉన్నారు. పీవీ కుమార్తెల్లో ఒకరైన వాణీదేవి పట్టభద్రుల ఎమ్మెల్సీగా విజయం సాధిం చారు.

రాజకీయ ప్రస్థానం

కరీంనగర్ జిల్లా మంథని నియోజకవర్గంలో 1957 నుంచి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 1962లో రెండోసారి విజయం సాధించిన తరువాత మంత్రిగా అవకాశంవచ్చింది. 1962 నుంచి 1971 వరకు వివిధ మంత్రిత్వ శాఖలను నిర్వహించారు. 1971లో సెప్టెంబరు 30న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. రెండేళ్ల ఆ పదవిలో కొనసాగిన పీవీ.. అనూహ్య రీతిలో సీఎం పదవిని కోల్పోయారు. ఆ తరువాత రాష్ట్ర రాజకీయాలకు గుడ్‌బై చెప్పి జాతీయ రాజకీయాల్లోకి అడుగు పెట్టారు. రాష్ట్ర రాజకీయాలకు కరీంనగర్ అండగా నిలబడితే జాతీయ రాజకీయాల్లో మాత్రం వరంగల్ జిల్లా నిలపెట్టింది. తొలిసారి 1977లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో హనుమకొండ ఎంపీ స్థానం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. తరువాత వచ్చిన మధ్యంతర ఎన్నికల్లో 1980లో మరోసారి పోటీచే సిన పీవీ రెండోసారి కూడా విజయం సాధించారు. 1980-84 మధ్యకాలంలో విదేశీ వ్యవహారాల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఆ తరువాత 1984లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో హనుమకొండ నుంచి మూడోసారి పోటీ చేసిన పీవీ.. బీజేపీ అభ్యర్థి చందుపట్ల జంగారెడ్డి చేతిలో ఓడిపోయారు. అయితే 1984లోనే మరోస్థానం మహ రాష్ట్రలోని రామ్‌టెక్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి కూడా పోటీ చేసి విజయం సాధించారు. 1984 నవంబరు నుంచి 1985 ఫిబ్రవరి వరకు భారత ప్రణాళిక శాఖ మంత్రిగా, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా పని చేశారు. 1985-1989 మధ్యకాలంలో కేంద్ర రక్షణ మంత్రిగా, కేంద్ర మానవవనరుల అభివృద్ధి శాఖ మంత్రిగా, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రిగా, విదేశీ వ్యవహారాలశాఖ మంత్రిగా పీవీ పనిచేశారు. 1989లో నాలుగోసారి రామ్‌టెక్ నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. 1991లో అప్పటి ప్రధాన మంత్రి రాజీవ్‌గాంధీ హత్యకు గురైన తరువాత పీవీ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1991-96 మధ్య కాలంలో ఏఐసీసీ అధ్యక్షుడిగా పనిచేశారు. అదే సమయంలో ప్రధానమంత్రిగా కూడా పీవీ నర్సింహరావు బాధ్యతలు చేపట్టారు. 1991 జూన్ నుంచి 1996 మే 10వ తేదీ వరకు కొనసాగారు. ఐదేళ్ల పాటు మైనారిటీ ప్రభుత్వాన్ని విజయవంతంగా నడిపిన ఘనత పీవీదే.

> "రాజనీతిజ్ఞుడు, బహుభాషా కోవిదుడు పీవీ నర్సింహరావు ఈ దేశానికి అందించిన సేవలు అపారం..' ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, కేంద్రమంత్రిగా, పార్లమెంట్ సభ్యుడిగా అయన చేసిన సేవలు చిరస్మరణీయం. దేశాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేయడంలో ఆయన నాయకత్వం బలమైన పునాది వేసింది. పీవీ హయాంలో ప్రపంచ మార్కెట్‌ను భారత్ ఆకర్షించింది. ఆయన పాలనలో ఆర్థిక వృద్ధికి కొత్త శకం మొదలైంది. విదేశాంగ విధానం, విద్యారంగంలో ఆయన అందించిన సహకారం దేశాన్ని సాంస్కృతంగా, మేధోపరంగా దేశాన్ని సుసంపన్నం చేసింది."
>
> - ట్విటర్ ఎక్స్‌లో ప్రధాని మోదీ



వంగర, లక్నేపల్లిలో సంబరాలు 7



మేడారంలో దుకాణాల లొల్లి

- జాతరలో కొబ్బరి, బెల్లం, లిక్కర్, కోళ్ల షాపుల పంపిణీలో గొడవ
- ఆదివాసీ సంఘాలు, పూజారులకే పంపకం
- తమకు కూడా ఇవ్వాలని అభ్యదయ యువజన సంఘం డిమాండ్
- పలుమార్లు పంచాయితీ.. కొలిక్కిరాని సమస్య

మేడారం, ఫిబ్రవరి 9: మేడారంలో కొబ్బరి, బెల్లంషాపుల లొల్లి రచ్చకెక్కింది. మహాజాతర సందర్భంగా జాతరలో ఏర్పాటు చేసే ఈ దుకాణాల పంపకంలో ఆదివాసీ సంఘాలకు, స్థానిక యువకులకు మధ్య అవగాహన కుదరడం లేదు. దీంతో జాతరలో 100 కోళ్ల దుకాణాలు, 20 బెల్లం, 20 కొబ్బరి, 22 లిక్కర్ దుకాణాలు ఏర్పాటు చేయడంలో జాప్యం పెరుగుతోంది. వాస్తవానికి ఈ నెల 7వ తేదీనే ఐటీడీఏ షాపులకు అనుమతులిస్తూ లైసెన్సులు జారీ చేయగా, పంపకాల్లో వచ్చిన గొడవతో ఇప్పటివరకు ఏర్పాటు కాలేదు. దీంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు.

పూజారులు, సంఘాలకే..

మహాజాతర సందర్భంగా భక్తులకు బెల్లం, కొబ్బరి, లిక్కర్, కోళ్ల దుకాణాలను జాతరలో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అనుమతులిస్తూ ఐటీడీఏ ద్వారా లైసెన్సులను జారీ చేస్తుంది. నిర్ణీత రుసుము చెల్లించి పూజారుల సంఘంతో పాటు ఆదివాసీ సంఘాల నాయకులు షాపులు లైసెన్సులను పొందుతారు. తరువాత ఫైవ్‌మెన్ కమిటీ ద్వారా ఎవరెవరికి ఎన్ని దుకాణాలను కేటాయించాలో నిర్ణయిస్తారు. అనంతరం లైసెన్సులు పొందిన వారు జాతర పరిసరాల్లో దుకాణాలను ఏర్పాటు చేసి వ్యాపారాలను ప్రారంభిస్తారు. ఇదిలా వుండగా, ప్రతీసారి జరిగే పద్ధతి ప్రకారం జాతరలో ఏర్పాటు చేసే షాపులను పూజారులు, ఆదివాసీ సంఘాలు సమానంగా పంచుకుం టాయి. షాపులను పూజారుల సంఘానికి కొన్ని కేటాయించిన తరువాత.. మిగిలిన షాపులను వివిధ ఆదివాసీ సంఘాల నాయకులు పంచుకునేవారు. దీని ప్రకారం తొలుత 20 కొబ్బరి, 20 బెల్లం దుకాణాలకు సం బంధించి రూ.14,700తో బ్యాంకు ద్వారా డీడీలు తీసి ఏటూరునాగారం గిరిజన సమగ్రాభివృద్ధి సంస్థ కార్యాలయంలో సమర్పించారు. ఈనెల 7వ తేదీన లైసెన్సులు మంజూరు చేసినట్లు అధికారులు తెలిపారు. కాగా, 100 కోళ్ల దు కాణాలు, 22 లిక్కర్ దుకాణాలు అనుమతులు రావాల్సి ఉందని తెలిపారు.

మాకు కూడా కావాలి..

ఈ సారి దుకాణాలు తమకు కూడా కేటాయించాలని మేడారంలోని అభ్యుదయ యువజన సంఘం యువకులు డిమాండ్ చేస్తున్నారు. గత వర్షాకాలంలో జంపన్నవాగు ఉప్పొంగి ప్రవహించడంతో మేడారం వరద ముంపునకు గురైందని, తాము చాలా నష్టపోయామని చెప్పారు. తమకు న్యాయం జరగాలంటే జాతరలో తాత్కలికంగా ఏర్పాటు చేసే కొబ్బరి బెల్లం లిక్కర్, కోళ్ల దుకాణాలలో కొన్ని కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. పూజారులకు కాకుండా, ఆదివాసీ సంఘాలకు కేటాయించే షాపుల్లో కొన్ని తమకు కేటాయించాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో దుకాణాల పంపిణీలో గొడవలు ప్రారంభమయ్యాయి. స్థానిక యువకులకు షాపులు కేటాయిస్తే సంఘాలకు తక్కువ వస్తాయని నాయకులు అభ్యంతరాలు తెలుపుతున్నారు. అయితే తమని కాదని జతరలో దుకాణాలను ఎలా నిర్వహిస్తారో చూస్తామంటూ యువకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో షాపుల పంపిణీ ప్రక్రియ నిలిచిపోయింది.

కొలిక్కిరాని గొడవ

మేడారం జాతరలో ఏర్పాటు చేసే కొబ్బరి, బెల్లం దుకాణాల పంపిణీల కోసం పూజారులు, ఆదివాసీ సంఘాల నాయకులు, స్థానిక యువత పలు సార్లు సమావేశం అయ్యారు. తమకు షాపులు తప్పకుండా కేటాయించాలని స్థానిక అభ్యుదయ యువజన సంఘం సభ్యులు పట్టుపడుతుండడంతో కొబ్బరి, బెల్లం దుకాణాల కేటాయింపు కొలిక్కిరాలేదు. దీంతో షాపులు లేక జాతరకు వచ్చే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు.

ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోని సింగరేణి

టార్గెట్ 640.39 లక్షల టన్నులు

ఇప్పటి వరకు 90 శాతం పూర్తి

భూపాలపల్లి ఏరియాలో పరిస్థితి అత్యల్పం

భూపాలపల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్ర జ్యోతి) : రాష్ట్ర ఇంధన అవసరాల్లో కీలకమైన బొగ్గు ఉత్పత్తి సామర్థ్యం సింగరేణిలో క్రమేణ తగ్గుతోంది. భూపాపల్లి, కొత్తగూడెం, ఇల్లం దు, మణుగూరు, బె ల్లంపల్లి, రామగుండం, మందమర్రి ప్రాంతాల్లో భూగర్భ గనుల్లో టార్గెట్ పూర్తి చేయడంలో వెనుకబడిపోయింది. గుడ్డిలో మెల్ల అన్నట్టు ఓపెన్‌కాస్టు మైన్స్‌లో కాస్త మెరుగైన ఉత్పత్తి జరుగుతోంది. దీంతో సింగరేణి పరిధిలో మొత్తంగా నిర్దేశించిన లక్ష్యానికి 75 శాతానికి పైగా పూర్తి చేస్తునట్టు సింగరేణి అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా బొగ్గు ఉత్పత్తి సామర్థ్యం పడిపోవడానికి అనేక కారణాలు ఉన్నాయంటున్నారు. కొత్తగా చేరిన కార్మికులతో పాటు వయోభారం పైబడిన కార్మికులు భూగర్భ గనుల్లో ఆశించిన రీతిలో పని చేయకపోవడం, యాక్టివ్‌గా పని చేసే కార్మికుల్లో చాలా మంది తరచూ విధులకు గైర్హాజరు కావడం తదితర కారణాలు ఉన్నాయం టున్నారు. మరోవైపు గనుల్లో యాంత్రిక సమస్యలు ఏర్పడటంతో రోజువారీ ఉత్పత్తి మందగిస్తోందంటున్నారు. దీంతో లక్ష్యాలను చేరుకునేందుకు ఆటంకా లు ఎదురవుతున్నాయని అధికారులు చెబుతున్నారు.

భూపాలపల్లి ప్రాంతాన్ని పరిగణనలోకి తీసుకుంటే ఈ ఏడాది మొత్తం 41.37 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. ఇప్పటి వరకు 27.98 లక్షల టన్నుల బొగ్గును మాత్రమే ఉత్పత్తి చేయ గలిగారు. ఈ లెక్కన మార్చి నెలాఖరుకు ఇంకా 13 లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేయాల్సి ఉంటుంది. అయితే ఇప్పుడున్న పరిస్థితుల్లో ఆ లక్ష్యాన్ని చేరుకోవడం సాధ్యం కాదని తెలుస్తోంది. ఇదిలా ఉంటే.. ఇతర ఏరియాల్లో కూడా ఉత్పత్తి బాగా తగ్గిపోయిందిజ ఇందులో ఓసీపీలు ఉత్పత్తి చేసిన బొగ్గు పరిమాణమే అధికంగా ఉందని తెలుస్తోంది.

ఇతర ఏరియాల్లో ఇలా..

ఈ ఏడాది సింగరేణి పరిధిలో ప్రాంతాల వారీగా బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను పరిశీలిస్తే కొత్తగూడెం ఏరియాలోని ఆరు గనుల నుంచి 37.92 లక్షల బొగ్గును వెలికి తీయాల్సి ఉండగా ఇక్కడ వంద శాతం లక్ష్యాన్ని పూర్తి చేశారు. 37.99 లక్షల టన్నును వెలికి తీశారు. రామగుండం ప్రాంతంలో 26.41 లక్షల టన్నుల బొగ్గును వెలికి తీయాల్సి ఉండగా ఇప్పటి వరకు 20.03 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి మాత్రమే జరిగింది. మొత్తంగా సంస్థ పరిధిలో 90 శాతం బొగ్గు ఉత్పత్తి జరిగినప్పటికీ ఇందులో ఓసీపీ గనుల్లో వెలికి తీసిన బొగ్గు శాతమే అధికంగా ఉండటం అధికారులను ఆందోళనకు గురి చేస్తుంది. భూగర్భ గనుల్లో పరిస్థితి గమనిస్తే ఒక్కో టన్ను బొగ్గు ఉత్పత్తిపై సగటున రూ. 7 నుంచి రూ. 8వేల నష్టం వాటిల్లుతోందని అంటున్నారు.

కేంద్ర మంత్రితో రామప్ప పరిరక్షణ కమిటీ కన్వీనర్ భేటీ

వెంకటాపూర్(రామప్ప), ఫిబ్రవరి 9: కేంద్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని రామప్ప పరిరక్షణ కమిటీ కన్వీనర్ ఆకిరెడ్డి రామ్మోహన్‌రావు భేటీ అయ్యారు. ఢిల్లీలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పలు అంశాలతో వినతిపత్రం అందజేశారు. జాతీయ రహదారి -163 నుంచి జాతీయ రహదారి 350సీ వరకు ఆరులైన్ల రోడ్డు నిర్మించాలని కోరారు. తద్వారా ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన రామప్ప దేవాలయ సందర్శకులకు ఎంతో అనుకూలంగా ఉంటుందని తెలిపారు.

రెండు జాతీయ రహదారులను కలిపే లింకురోడ్డు హైదరాబాద్ నుంచి భూపాలపట్నం(ఛత్తీస్‌గఢ్), గూడెప్పాడ్ నుంచి సిరివంచ(మహారాష్ట్ర) వరకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని అన్నారు. దీనిపై స్పందించిన నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించారు. ప్రస్తుతం రాష్ట్ర రహదారులను జాతీయ రహదారుల్లోకి తీసుకొచ్చి నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు.



కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి వినతిపత్రం అందజేస్తున్న రామ్మోహన్‌రావు

విద్యారంగ సమస్యలపై నిరంతర పోరు

పీఆర్‌టీయూ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు సుభాకర్‌రెడ్డి



సంఘం జెండా ఆవిష్కరిస్తున్న పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సుభాకర్‌రెడ్డి

భూపాలపల్లిటౌన్, ఫిబ్రవరి 9: విద్యారంగ సమస్యలపై పీఆర్‌టీయూ నిరంతర పోరాటం చేస్తోందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రేగూరి సుభాకర్‌రెడ్డి అన్నారు. పీఆర్‌టీయూ ఆవిర్భావ వేడుకలు భూపాలపల్లి పట్టణంలోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాల ఆవరణలో శుక్రవారం జరిగాయి. ఈ సందర్భంగా సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం మండల అధ్యక్షుడు బండి రాజ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో సుభాకర్‌రెడ్డి మాట్లాడుతూ 1971లో పంచాయతీరాజ్ ఉపాధ్యాయుల ఆత్మగౌరవం కోసం ఏర్పడిన పీఆర్‌టీయూ పోరాటాలకు అర శతాబ్ద కాలం దాటిందన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం సంఘం నిరంతరాయంగా పోరాడుతోందన్నారు.ఈ కార్యక్రమంలో సంఘం సీనియర్ నాయకులు మందల రవీందర్‌రెడ్డి, కుసుమ కృష్ణమోహన్, విజయ, గడ్డం సురేష్, రాజిరెడ్డి, రవీందర్, స్వామి, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ములుగులో ఆవిర్భావ వేడుకలు

ములుగు కలెక్టరేట్ : పీఆర్టీయూ ఆవిర్భావ వేడుకలు జిల్లా కేంద్రంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. సంఘం వ్యవస్థాపకుడు సామల యాదగిరి చిత్రపటానికి ఈసందర్భంగా జిల్లా గౌరవ అధ్యక్షుడు దేవులపల్లి సత్యనారాయణ, అధ్యక్షుడు కాసర్ల రమేష్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు రమేష్ సంఘం జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వేం యాకూబ్‌రెడ్డి, నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిల్లల అపహరణపై ఆందోళన

సోషల్ మీడియాలో ప్రచారంతో తల్లిదండ్రుల బెంబేలు

కృష్ణకాలనీ (భూపాలపల్లి), ఫిబ్రవరి 9: చిన్నపిల్లలు అపహరణకు గురవుతున్నారనే ప్రచారంతో సర్వత్రా ఆందోళన నెలకొంది. సోషల్ మీడియాలో ఈ వార్తలు చక్కర్లు కొడుతుండటంతో తల్లిదండ్రులు బెంబేలెత్తు తున్నారు. బీహార్ తదితర రాష్ట్రాలకు చెందిన కొంత మంది ముఠాగా ఏర్పడి చిన్నపిల్లలను ఎత్తుకెళ్తున్నారనే విషయం వైరల్ కావడంతో హైరానా పడుతున్నారు. పలు జిల్లాల్లో కొంత మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారనే వార్తలు రావడంతో భూపాలపల్లి జిల్లాలో ఆ భయం వెంటాడుతోంది. పిల్లలను బయటకు పంపాలంటేనే తల్లిదండ్రులు జంకుతున్నారు. ముఖ్యంగా పాఠశాలలకు ఎంతో జాగ్రత్తగా పంపుతున్నారు. పిల్లలను స్కూళ్ల వద్ద దింపి జాగ్రత్తగా చూసుకోవాలంటూ యాజమాన్యాలను తల్లిదండ్రులు కోరుతున్నారు.

మరోవైపు జిల్లా కేంద్రంలో కొంత మంది అనుమానాస్పదంగా తిరుగుతున్నట్టు కూడా సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. కొత్త వ్యక్తులు విచిత్ర వేషధారణతో సంచరిస్తున్నట్టు పలు కాలనీవాసులు అంటున్నారు. ఇంత భయాందోళన నెలకొన్నా పోలీసులు ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

వదంతులు నమ్మొద్దు : ఏఎస్పీ

పిల్లలను అపహరించే ముఠా సంచరిస్తోందని సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వార్తలను ప్రజలు నమ్మొద్దని భూపాలపల్లి ఏఎస్పీ (అడ్మిన్) నరేష్ కుమార్ అన్నారు. ఇవన్నీ వదంతులను అలాంటి సంఘటనలు ఎక్కడా లేవని, దీనిపై భయపడాల్సిన పనిలేదని అన్నారు.

అలాంటి ఏవైనా సంఘటనలు ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. వదంతులను వ్యాప్తి చేసి భయాందోళన కలిగించొద్దని అన్నారు.

నిధులు గలగల పారేనా?

(3వ పేజీ తరువాయి)

ప్రకటించారు. ఈ నేపథ్యంలో బడ్జెట్‌లో ఎయిర్‌పోర్టుకు నిధుల కేటాయింపు జరగవచ్చునని భావిస్తున్నారు.

నగరాభివృద్ధి

వరంగల్ నగరాభివృద్ధికి బడ్జెట్‌లో చాలినన్ని నిధులు కేటాయించాల్సిన అవసరం ఉన్నది. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు, ఔటర్ రింగ్ రోడ్డు పనుల పూర్తికి నిధులేమైనా బడ్జెట్‌లో కేటాయింపు జరుగుతుందా? నిధుల లేమి వల్ల కాళోజీ కళాక్షేత్రం పనులు పదేళ్లుగా నత్తనడకన సాగుతున్నాయి. రూ. 50 కోట్లతో చేపట్టి ఈ ప్రాజెక్టుకు గత ప్రభుత్వం నిధులు ఇవ్వలేదు. అంచనా వ్యయంతో రూ.100కోట్లకు పెరిగింది. కళాక్షేత్రాన్ని పూర్తి చేయడానికి బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు కేటాయించాల్సిన అవసరం ఉంది.

మెగా లెదర్ పార్క్

జనగామ జిల్లా పరిధిలోని మెగా లెదర్ పార్క్ ఏర్పాటు చేస్తామని 2016లో అసెంబ్లీ సాక్షిగా కేటీఆర్ ప్రకటించారు. కానీ ఇప్పటి వరకు సాకారం కాలేదు. ఈ పార్క్ ఏర్పాటుపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ దృష్ట్యా ఈ బడ్జెట్‌లో నిధుల కేటాయింపు జరగవచ్చునని జనగామ జిల్లా వాసులు ఆశపడుతున్నారు. కొడకండ్లలో మినీ టెక్స్‌టైల్ పార్క్ దేవరుప్పుల, నష్కల్‌లో ఫుడ్ ప్రాజెసింగ్ జోన్ల ఏర్పాటు విషయమై బడ్జెట్‌పై ఆశలు పెట్టుకున్నారు.

బయ్యారం ఉక్కు

గత బడ్జెట్‌లో మహబూబాబాద్ జిల్లాకు కేసీఆర్ ప్రభుత్వం మొండి చేయిచూపింది. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటుపై ప్రభుత్వం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వివాదం సాగుతోంది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇటీవలే ఢిల్లీలో ఈ విషయమై సంబంధిత కేంద్ర మంత్రులతో చర్చించింది. ఈ ప్రాజెక్టు ఏర్పాటు ప్రాథమిక పనులకు శ్రీకారం చుట్టాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగా శనివారం నాటి బడ్జెట్‌లో నిధుల ప్రస్తావన ఉండొచ్చని ఆశిస్తున్నారు. మల్యాలలో కృషి విజ్ఞాన కేంద్రం జెన్నారెడ్డి వెంకట్‌రెడ్డి స్మారక ఉద్యానవన ఫల పరిశోధన కేంద్రానికి అనుబంధంగా వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల కోసం నిధుల ప్రకటనను జిల్లా ప్రజలు ఆశిస్తున్నారు.

మేడారం జాతర

సీఎం రేవంత్ రెడ్డికి మేడారం సమ్మక్క సారలమ్మ జాతరతో సెంటిమెంట్ ఉంది. కిందటేడు పాదయాత్రను ఇక్కడి నుంచే మొదలు పెట్టారు. ముఖ్యమంత్రిగా పదవిని అధిష్ఠించారు. ఈ క్రమంలో ఈ సారి జాతరకు రానున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మేడారం జాతరలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధుల ప్రకటన ఏమైనా ఉంటుందా? అని ములుగు జిల్లా వాసులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. జాతరను జాతీయ పండుగ హోదాను కల్పించడంపై కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చే విషయమై బడ్జెట్‌లో ప్రస్తావన ఉంటుందా? అని చర్చించుకుంటున్నారు.

దిక్సూచి DIKSUCHI

మౌలానా ఆజాద్ వర్సిటీలో
పార్ట్ టైమ్ పీహెచ్‌డీ



హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ(మనూ) - పార్ట్ టైం పీహెచ్‌డీ ప్రోగ్రామ్ 2023-24 వింటర్ సెషన్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. స్పాన్సర్డ్, సెల్ఫ్ ఫైనాన్సింగ్ విధానాలు అందుబాటులో ఉన్నాయి. ఇంజనీర్‌లు, సైంటిస్ట్‌లు, సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు, మేనేజీరియల్ స్టాఫ్, స్టార్టప్ ప్రమోటర్స్, అకడమిక్ అడ్మినిస్ట్రేటర్లు, టీచర్లు దరఖాస్తు చేసుకోవచ్చు. రీసెర్చ్ అడ్మిషన్ టెస్ట్(ఆర్‌ఏటీ), డాక్యుమెంట్స్ వెరిఫికేషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. గరిష్ఠంగా ఆరేళ్లలో పూర్తిచేయవచ్చు. స్కాలర్‌షిప్ సౌకర్యం లేదు.

విభాగాలు-సీట్లు: మేనేజ్‌మెంట్ విభాగాల్లో 9, కామర్స్ విభాగాల్లో 6, సైన్సెస్ విభాగాల్లో 21, టెక్నాలజీ విభాగాల్లో 4, ఎడ్యుకేషన్ అండ్ ట్రెయినింగ్ విభాగాల్లో 38, దక్కన్ స్టడీస్ విభాగాల్లో 5, సోషల్ సైన్సెస్ విభాగాల్లో 15, మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం విభాగాల్లో 7 సీట్లు ఉన్నాయి.

అర్హత: పదోతరగతి/ఇంటర్/డిగ్రీ స్థాయిలో ఉర్దు ఒక సబ్జెక్ట్‌గాగానీ లేదా ఉర్దూ మీడియంలోగానీ చదివి ఉండాలి. లేదా మదర్సా కోర్సు పూర్తిచేసి ఉండాలి. ఉర్దూ భాషకు సంబంధించి ఎటువంటి అర్హత లేనివారు థీసిస్ సబ్మిషన్ నాటికి వర్సిటీ అందించే రెండు క్రెడిట్ల ఉర్దూ కోర్సు పూర్తిచేయాల్సి ఉంటుంది.

- విభాగాన్ని అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌తో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి. వర్సిటీ నిర్వహించే రీసెర్చ్ అడ్మిషన్ టెస్ట్‌లో అర్హత పొంది ఉండాలి. యూజీసీ/సీఎస్ఐఆర్/ ఇన్‌స్పయిర్/ఐకార్/ఐసీహెచ్ఆర్/ఐసీఎంఆర్/డీబీటీ/డీఎస్‌టీ ఫెలోషిప్ లేదా రాజీవ్ గాంధీ ఫెలోషిప్ అవార్డ్/టీచర్ ఫెలోషిప్ పొందినవారు; నెట్/సెట్/స్లెట్/జీప్యాట్/గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారు; ఎంఫిల్ అభ్యర్థులు ఆర్ఏటీ రాయనవసరం లేదు. దరఖాస్తు నాటికి సంబంధిత రంగంలో మూడేళ్ల అనుభవం ఉండాలి. అభ్యర్థులు పనిచేస్తున్న సంస్థ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ సబ్మిట్ చేయాలి. వయోపరిమితి నిబంధనలు లేవు.

వెయిటేజీ: యూజీసీ/సీఎస్ఐఆర్ జేఆర్ఎఫ్ అర్హత ఉన్నవారికి, స్పాన్సర్డ్ అభ్యర్థులకు, రీసెర్చ్ సంస్థల్లో సైంటిస్ట్‌లకు 70 మార్కులు; నెట్/సెట్/స్లెట్/గేట్/ జీప్యాట్ అర్హత ఉన్నవారికి, ఇన్‌స్పయిర్/రాజీవ్ గాంధీ తదితర ఫెలోషిప్‌లు ఉన్నవారికి 60 మార్కులు; ఎంఫిల్ అభ్యర్థులకు 50 మార్కుల వెయిటేజీ ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.1500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 18
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** ఫిబ్రవరి 28 నుంచి
- **రీసెర్చ్ అడ్మిషన్ టెస్ట్ తేదీ:** మార్చి 8
- **ఫైనల్ కీ విడుదల:** మార్చి 12
- **ఫలితాలు విడుదల:** మార్చి 15
- **సర్టిఫికెట్ వెరిఫికేషన్:** మార్చి 18, 19
- **ఇంటర్వ్యూకి ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** మార్చి 22
- **ఇంటర్వ్యూలు:** మార్చి 27, 28
- **అడ్మిషన్స్:** ఏప్రిల్ 3, 4
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** ఏప్రిల్ 15 నుంచి
- **వెబ్‌సైట్:** manuu.edu.in

ఐఐపీఈలో షార్ట్ కోర్సు

విశాఖపట్నంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ(ఐఐపీఈ)కి చెందిన హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్(హెచ్&ఎస్) విభాగం- 'అప్లికేషన్స్ ఆఫ్ స్కాలర్ హైపర్‌బోలిక్ కన్జర్వేషన్ లాస్' అంశానికి సంబంధించి షార్ట్ కోర్సును అందిస్తోంది. దీనిని ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. కోర్సు వ్యవధి అయిదు రోజులు. డిగ్రీ/పీజీ చేస్తున్న అభ్యర్థులు, రీసెర్చ్ స్కాలర్స్, పోస్ట్ డాక్టోరల్ ఫెలోస్, మేథమెటిక్స్/సంబంధిత విభాగాలకు చెందిన ఫ్యాకల్టీ మెంబర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఇందులో పార్టిసిపేట్ చేసినవారందరికి ఈ-సర్టిఫికెట్లు ఇస్తారు.

- **కోర్సు తేదీలు:** మార్చి 1 నుంచి 5 వరకు
- **రిజిస్ట్రేషన్ ఫీజు:** డిగ్రీ/పీజీ విద్యార్థులకు రూ.354; రీసెర్చ్ స్కాలర్స్‌కు రూ.590; పోస్ట్ డాక్టోరల్ ఫెలో/ఫ్యాకల్టీ మెంబర్లకు రూ.1180
- **రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** ఫిబ్రవరి 28
- **వెబ్‌సైట్:** www.iipe.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/TfRqOkFలో చదవండి.

నాగార్జున వర్సిటీలో డిస్టెన్స్ ప్రోగ్రామ్‌లు

గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ(ఏఎన్‌యూ) నిర్వహిస్తున్న సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్(సీడీఈ)- దూరవిద్య కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

డిగ్రీ కోర్సులు: ఒక్కో కోర్సు వ్యవధి మూడేళ్లు. ఏడాదికి రెండు చొప్పున ఆరు సెమిస్టర్లు ఉంటాయి. బీఏని తెలుగు మాధ్యమంలో; బీకాం(కంప్యూటర్ అప్లికేషన్స్), బీబీఏ ప్రోగ్రామ్‌లను ఆంగ్ల మాధ్యమంలో; బీకాం(జనరల్) కోర్సుని రెండు మాధ్యమాల్లో చదువుకోవచ్చు.

- బీఏ సబ్జెక్టులు ఎకనామిక్స్, హిస్టరీ, పాలిటిక్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, హిస్టరీ, స్పెషల్ ఇంగ్లీష్, స్పెషల్ తెలుగు, బ్యాంకింగ్, కంప్యూటర్ అప్లికేషన్స్.

పీజీ కోర్సులు: ఒక్కో కోర్సు వ్యవధి రెండేళ్లు. ఏడాదికి రెండు చొప్పున నాలుగు సెమిస్టర్లు ఉంటాయి.

ఎంఏ స్పెషలైజేషన్‌లు: ఇంగ్లీష్, తెలుగు, సంస్కృతం, హిందీ, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, సోషియాలజీ, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, హ్యూమన్ రిసోర్సెస్ మేనేజ్‌మెంట్

ఎంకాం స్పెషలైజేషన్‌లు: అకౌంటెన్సీ, బ్యాంకింగ్

లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ కోర్సులు: బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది.

డిప్లొమా: కోర్సు వ్యవధి ఏడాది. ఆంగ్ల మాధ్యమంలో అందుబాటులో ఉంది. పదోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు అర్హులు.

- స్పెషలైజేషన్‌లు: ఫుడ్ ప్రొడక్షన్, సైకలాజికల్ గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్

సర్టిఫికెట్ కోర్సులు: ఒక్కో కోర్సు వ్యవధి ఏడాది. వీటిని ఆంగ్ల మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.

- సర్టిఫికెట్ కోర్స్ ఇన్ హోటల్ అండ్ హాస్పిటల్ హౌస్ కీపింగ్
- సర్టిఫికెట్ కోర్స్ ఇన్ హెచ్ఐవీ ఎయిడ్స్ కౌన్సెలింగ్.


ముఖ్య సమాచారం

- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 29
- **వెబ్‌సైట్:** www.anucde.info



పద్మవిభూషణ్ పురస్కారానికి ఎంపికైన సందర్భంగా చిరంజీవిని తెలంగాణ గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ సత్కరించారు. చిరంజీవి, సురేఖ దంపతులు శుక్రవారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. చిరంజీవికి ప్రతిష్ఠాత్మకమైన పద్మవిభూషణ్ పురస్కారం ప్రకటించడం పట్ల సౌందరరాజన్ హర్షం వ్యక్తం చేశారు. కోట్లాది ప్రేక్షక హృదయాలను గెలుచుకున్నారని ఆమె చిరంజీవిని అభినందించారు.

కాంబినేషన్ కుదిరింది





విభిన్న కథలు, సరికొత్త గెటప్పులతో ప్రేక్షకులను మెప్పించడం తమిళ హీరో విక్రమ్ పంథా. ఆయన కథానాయకుడిగా ఎస్ యూ అరుణ్ కుమార్ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. 'చియాన్ 62' వర్కింగ్ టైటిల్. ఇందులో విక్రమ్ ఎలాంటి పాత్ర చేయబోతున్నారనేది ప్రస్తుతానికి సస్పెన్స్. తాజాగా చిత్రబృందం స్పెషల్ అప్‌డేట్‌ను వదిలింది. మాస్ యాక్షన్ ఎంటర్టైనర్‌గా తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో మరో స్టార్ యాక్టర్ ఎస్ జే సూర్య భాగమవుతున్నారు. ఈ విషయాన్ని చిత్రబృందం శుక్రవారం ప్రకటించింది. ఈ చిత్రంలో సూర్య మునుపెన్నడూ చూడని సరికొత్త పాత్రలో కనిపిస్తారని యూనిట్ తెలిపింది. రియా శిబు నిర్మిస్తున్న ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు.

నేనూ ప్రేమలో పడ్డా



సుబ్బు, శ్రీవల్లి, కిట్టయ్య ప్రధాన పాత్రలు పోషించిన 'ఐ హేట్ లవ్' చిత్రం ఈ నెల 16న విడుదల కానుంది. 'నేనూ ప్రేమలో పడ్డా' అనేది ఉప శీర్షిక. వెంకటేశ్ రవి దర్శకత్వంలో డాక్టర్ బాల రవి ఈ సినిమాను నిర్మించారు. చిత్రం ట్రైలర్‌ను దర్శకుడు వీరశంకర్ ఆవిష్కరించారు. సినిమా కో ప్రొడ్యూసర్ పాలగుమ్మి వెంకట కృష్ణ ఈ సందర్భంగా మాట్లాడుతూ 'మంచి చిత్రాలను ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారు. అలాగే మా సినిమా కూడా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది' అన్నారు. దర్శకుడు వెంకటేశ్ మాట్లాడుతూ 'కోనసీమ పరిసర ప్రాంతాల్లో షూటింగ్ చేశాం. యూత్‌ను ఆకట్టుకొనే సందేశాత్మక చిత్రం ఇది' అని చెప్పారు. ఈ చిత్రానికి అంగర శివ సాయి గౌడ ఎగ్జిక్యూటివ్ నిర్మాత.

ఏదో ఏదో మాయ

గోపీచంద్ కథానాయకుడిగా నటిస్తున్న యాక్షన్ ఎంటర్టైనర్ 'భీమా'. ఈ చిత్రంలో ఆయన పవర్‌ఫుల్ పోలీసాఫీసర్‌గా కనిపించనున్నారు. ప్రియా భవానీ శంకర్, మాళవిక శర్మ కథానాయికలు. ఏ హర్ష దర్శకత్వంలో కేకే రాధామోహన్ భారీస్థాయిలో నిర్మిస్తున్నారు. మార్చి 8న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. చిత్రబృందం మ్యూజిక్ ప్రమోషన్స్‌ను ప్రారంభించింది. శుక్రవారం 'ఏదో ఏదో మాయ' అంటూ సాగే తొలి గీతాన్ని విడుదల చేసింది. రవి బస్రూర్ స్వరపరిచిన ఈ గీతానికి కల్యాణ్ చక్రవర్తి సాహిత్యం అందించారు. అనురాగ్ కులకర్ణి ఆలపించారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: స్వామి జె గౌడ. ఎడిటర్: తమ్మిరాజు



నవ్య 'స్మార్ట్ పేజీ'లో ఆసక్తికర కథనాల కోసం...ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్https://ejyothy.com/eXnCM8Wలో చదవండి.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/0UvYLxHలో చదవండి.

మహాజాతర అతిథులకు ప్రత్యేక జ్ఞాపికలు

సమ్మక్క, సారలక్క గద్దెల రూపంలో తయారీ

భద్రాద్రి ఆదివాసీ కళాకారులతో రూపకల్పన

భద్రాచలం, ఫిబ్రవరి 9: మేడారం సమ్మక్క, సారక్క మహాజాతరకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశం నలుమూలల నుంచి తరలివచ్చే అతిథుల కోసం ఈసారి ప్రత్యేక జ్ఞాపికలను సిద్ధం చేశారు. ఈనెల 21 నుంచి 24 వరకు జాతర జరగనుంది. ఇందులో హాజరయ్యే కీలక అతిథులకు ఆహ్వాన పత్రికతో పాటు సమ్మక్క, సారలక్క గద్దెల రూపంతో ఉన్న జ్ఞాపికను అందించాలనే సంకల్పంతో వాటిని సిద్ధం చేయాలని గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో భద్రాచలం ఐటీడీఏలోని ఆదివాసీ కళాకారులు కోయ కల్చరల్ ఆర్ట్స్ అండ్ ఫుడ్ క్రాఫ్ట్స్ ఆధ్వర్యంలో జ్ఞాపికలను తయారు చేశారు. భద్రాద్రి జిల్లా దుమ్ముగూడెం మండలం నైట్‌నా గారానికి చెందిన పాయం కృష్ణమూర్తి, భద్రాచలానికి చెందిన పాయం సలీంకుమార్ తమ సిబ్బందితో కలిసి వీటిని రూపొందించారు. ఈ జ్ఞాపికలను ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులు కొండా సురేఖ, సీతక్క పరిశీలించారు. ఈ జ్ఞాపికలను రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధాన మంత్రి, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తదితరులకు అందించనున్నారు. జ్ఞాపికలను సిద్ధం చేసిన కళాకారులకు గిరిజన సంక్షేమ శాఖ నగదు అందజేయనుంది. తొలిసారి మేడారం జాతరకు తరలివచ్చే అతిథులకు ఆహ్వాన పత్రికతో పాటు జ్ఞాపికను రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తోంది.


జ్ఞాపికను చూపుతున్న కళాకారుడు

మేడారంలో భక్తుల సందడి

ముందస్తు మొక్కుల సమర్పణ


జంపన్నవాగులోని బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ కింద స్నానం చేస్తున్న భక్తులు


వనదేవతలకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

మేడారం, ఫిబ్రవరి 9 : తాడ్వాయి మండలం మేడారం వనదేవతలు సమ్మక్క- సారలమ్మలను దర్శించుకోవడానికి భక్తులు శుక్రవారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. కుటుంబ, బంధు మిత్రులతో కలిసి మహాజాతరకు ముందుగా మొక్కులు చెల్లించుకుని తల్లులను నేరుగా దర్శించుకున్నారు. ఎత్తు బెల్లాలతో, పూలు, పండ్లు, చీరె, సారె, కొబ్బరికాయలు, పసుపు, కుంకుమలు సమర్పించి యాట మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా జంపన్న వాగులో పుణ్య స్నానాలు ఆచరించారు. కల్యాణ కట్టల్లో తలనీలాలు సమర్పించారు. శివసత్తుల పూనకాలతో, డోలు వాయిద్యాలతో మేడారంలో సందడి చేశారు. ఈ క్రమంలో పరిసరాలన్ని భక్తులతో రద్దీగా కనిపించాయి. జాతర వైభవం ముందుగానే సంతరించుకుని మేడారం జాతర సందడి మొదలైందని వ్యాపారులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. భక్తులకు దేవాదాయ శాఖ అధికారులు నిరంతరం దర్శనాలు కల్పించడంతో తల్లులను భక్తులు రాత్రి పగలు తేడా లేకుండా సమ్మక్క, సారలమ్మలకు ముందస్తు మొక్కులు చెల్లించుకుంటున్నారు.



విద్యుత్ కాంతులు

మేడారం మహాజాతరను పురస్కరించుకొని వనదేవతలు సమ్మక్క సారలమ్మల గద్దెల ప్రాంగణాన్ని రంగురంగుల విద్యుత్ లైట్లతో సర్వాంగా సుందరంగా అలంకరించారు. విద్యుత్ కాంతులతో తల్లుల గద్దెలు శనివారం భక్తులకు కనువిందు చేశాయి. రాత్రిళ్లు మొక్కులకై గద్దెకు వచ్చిన భక్తులు విద్యుత్ కాంతులను చూస్తు పరవశించి పోయారు.

పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి : ఐజీ తరుణ్ జోషి

మేడారం, ఫిబ్రవరి 9 : మహాజాతరలో పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మల్టీజోన్ ఐజీ తరుణ్ జోషి అన్నారు. మేడారంలోని హరిత హోటల్‌లో పోలీసు నోడల్ అధికారులతో ఆయన శుక్రవారం సమావేశమయ్యారు. గత జాతరలో ఎదురైన సమస్యలు పునరావృతం కాకుండా పరిష్కారాల దిశగా చర్చించారు. డ్యూటీ పాయింట్లలో విధులు నిర్వర్తించే సిబ్బంది పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. పోలీసులు భక్తులతో దురుసుగా ప్రవర్తించొద్దని సూచించారు. జాతరలో ట్రాఫిక్ నిర్వహణను చాలెంజింగ్‌గా తీసుకోవాలని అన్నారు. 1.5 కోట్ల మంది పైచిలుకు భక్తులు హాజరవుతారని, సుమారు 5 లక్షల వాహనాలు వచ్చే అవకాశం ఉందని అన్నారు. దీనికి అనుగుణంగా పార్కింగ్ స్థలాలను పెంచినట్టు తెలిపారు. క్రమ పద్ధతిలో వాహనాలను పార్కింగ్ స్థలాలకు చేర్చగలిగితే ట్రాఫిక్ జామ్ కాకుండా జాతరను విజయవంతం చేయొచ్చన్నారు. ఎక్కడైనా యాక్సిడెంట్లు జరిగితే అంబులెన్స్ లేదా పోలీసు వాహనాల్లో క్షతగాత్రులను వెంటనే ఆస్పత్రికి తరలించాలని సూచించారు. ట్రాఫిక్ పార్కింగ్ గద్దెల వద్ద పుషింగ్ పార్టీల పాత్ర కీలకమన్నారు. క్యూలైన్ల వద్ద భక్తులు ఎక్కువసేపు వేచి ఉండకుండా ఎప్పటికప్పుడు గద్దెల వద్దకు తరలించాలన్నారు. జాతర మొత్తం సీసీ కెమెరాల నిఘా నేత్రాల నడుమ జరుగుతుందని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామని తెలిపారు. సమావేశంలో ములుగు ఎస్పీ శబరీశ్, వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి, భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే, ఓఎస్డీ అశోక్ కుమార్, ఏఎస్పీ సంకీర్త్ పాల్గొన్నారు.


నోడల్ అధికారులతో మాట్లాడుతున్న ఐజీ తరుణ్ జోషి

ప్లాస్టిక్ రహిత జాతరగా నిర్వహిద్దాం

అదనపు కలెక్టర్ శ్రీజ

మేడారం, ఫిబ్రవరి 9 : సమ్మక్క, సారలమ్మల మహాజాతరను ప్లాస్టిక్ రహితంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అదనపు కలెక్టర్ శ్రీజ అన్నారు. మేడారంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. జాతరలో ప్లాస్టిక్‌ను నిషేధించాలని కాంక్షిస్తూ రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. మహా జాతరలో ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలన్నారు. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ గ్లాస్‌లను, ప్లేట్స్, సీసాలు, కవర్లు వాడకుండా క్లాత్ సంచులు, విస్తరాకులు, భక్తులు ఇంటి నుంచే తెచ్చుకోవాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు సుదర్శన్‌రెడ్డి, రాజు, సాంబయ్య, జిల్లా సైన్స్ అధికారి, జయదేవ్, ప్రధానోపాధ్యాయులు కేశవరావు, విద్యాసాగర్, డీసీఈబీ సహాయ కార్యదర్శి విక్రం తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి త్రైపాక్షిక భద్రతా సమావేశం

కాకతీయఖని, ఫిబ్రవరి 9: సింగరేణి భూపాలపల్లి ఏరియాలోని ఇల్లందు గెస్ట్‌హౌస్‌లో ఏరియా జనరల్ మేనేజర్ బళ్లారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో త్రైపాక్షిక భద్రతా సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు.

ముఖ్యఅతిథులుగా డైరెక్టర్ (మైనింగ్) ఉమేష్ మధూకర్‌రావు సావర్కర్, డైరెక్టర్ (మెకానికల్) జి.బైసారే, డైరెక్టర్ (ఎలక్ట్రికల్) ఆనందవెల్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ మైన్స్ జార్జ్ జాన్, డీడీఎంఎస్ సనత్‌కుమార్, డిప్యూటీ డైరెక్టర్ (మైనింగ్) కమలేష్ కుమార్ హాజరయ్యారు. ఏరియాలో జరిగిన ప్రమాదాలపై ఏరియా సేఫ్టీ అధికారి డి.ఎల్.ప్రసాద్ పవర్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రక్షణ చర్యలకు పాటించాల్సిన నియమాల గురించి వివవరించారు. ప్రమాద రహిత బొగ్గు ఉత్పత్తికి తోడ్పాటునందించాలని డైరెక్టర్లు సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు హరినారాయణ, కవీంద్ర, వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కమిటీ సభ్యులు

ప్రజా ఉద్యమాలే బీఆర్ఎస్‌కు పునాది

ములుగు జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి


ఆడియో సీడీని ఆవిష్కరిస్తున్న బడే నాగజ్యోతి

మంగపేట, ఫిబ్రవరి 9: ప్రజా ఉద్యమాలే బీఆర్ఎస్‌కు పునాది అని ములుగు జడ్పీ చైర్మన్ బడే నాగజ్యోతి అన్నారు. మండలంలోని కమలాపురం, మంగపేట, బోరునర్సాపురం, మల్లూరు, కొత్తమల్లూరు, చుంచుపల్లి, పాలాయిగూడెం, వాడగూడెం, రమణక్కపేట, రాజుపేట, లక్ష్మీనర్సాపురం గ్రామాల్లో ఆమె శుక్రవారం పర్యటించారు. బీఆర్ఎస్ నాయకులతో కలిసి వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. లక్ష్మీనర్సాపురంలో నాగులమ్మ దేవతను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ప్రధాన పూజారి బాడిశ రామకృష్ణస్వామిజీ నుంచి తీర్థ, ప్రసాదాలు, కుంకుమ, పుసుపులను స్వీకరించారు. రాజుపేటలో మద్దెల సమ్మక్క రాసిన నాగులమ్మ ఆడియో సీడీని ఆవిష్కరించారు. రమణక్కపేటకు చెందిన ముస్కే గ్రేశ్మంత్ అనే విద్యార్థి గోదావరిలో గురువారం ఈతకు వెళ్లి మృతి చెందగా మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. రాజుపేటలో జరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో నాగజ్యోతి మాట్లాడుతూ ప్రజా ఉద్యమాల ద్వారానే బీఆర్ఎస్‌ను బలోపేతం చేయాలని అన్నారు. ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ, ప్రజలను చైతన్యం చేసేలా పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమాలకు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ, తాడ్వాయి మాజీ జడ్పీటీసీ రామసహాయం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు కొమరం ధనలక్ష్మి, మాదారి రామయ్య, కొమరం రామ్మూర్తి, బీఆర్ఎస్ నాయకులు కర్రి శ్యాంబాబు, మాటూరి ఏడుకొండల్, ప్రవీణ్, టి.శ్రీను, చదలవాడ సాంబశివరావు, పి. శ్రీను, ఈశ్వర్, పుల్లారావు, కె. శ్రీను, ఎం. శంకర్, భద్రయ్య, సి.హెచ్. తిరుపతి, బి. సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

కాకతీయఖని, ఫిబ్రవరి 9: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సింగరేణి ఉద్యోగులు అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డికి శుక్రవారం వినతి పత్రాన్ని అందజేశారు. సింగరేణి సంస్థలో అండర్‌మేనేజర్లు, వెల్ఫేర్ అధికారుల ఇంటర్నల్ ప్రమోషన్ల కోసం ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు రవీందర్, శంకర్, మోహన్, సమ్మిరెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో సంబరాలు

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 9: భారతదేశ మాజీ ప్రధానమంత్రి పీవీ.నరసింహరావు చేసిన సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం భారతరత్న పురస్కారం ప్రకటించడం పట్ల ములుగులో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం ఆధ్వ ర్యంలో నాయకులు శుక్రవారం రాత్రి సంబరాలు నిర్వహించారు. ములుగులోని గాంధీచౌక్ వద్ద 163వ జాతీయ రహదారిపై నాయకులు, కార్యకర్తలు బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచుకున్నారు. ఈసందర్భంగా బలరాం మాట్లాడుతూ తెలంగాణ ముద్దుబిడ్డ, బహుభాషా కోవిదుడు, దేశ ఆర్థిక సంస్కరణలకు పునాది వేసిన పీవీ.నరసింహారావుకు భారతరత్న పురస్కారం రావడం సంతోషకరమని అన్నారు. బీజేపీ ఏపార్టీకి సంబంధం లేకుండా కష్టపడే ప్రతి వ్యక్తికి. వారు చేసిన సేవలను గుర్తించడమే ముఖ్య లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మహబూబాబాద్ పార్లమెంట్ నాయకురాలు అజ్మీరా స్వరూప, నాయకులు నగరపు రమేష్, శీలమంతుల రవింద్రచారి, చల్లూరి మహేందర్, రవిరెడ్డి, కృష్ణాకర్‌రావు, కొత్త సురేందర్, పరమేశ్వర్, కారుపోతుల యాదగిరి, హరీశ్, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

భార్యను ఆస్పత్రికి తీసుకొచ్చి..

అనంతలోకాలకు

- రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

కృష్ణకాలనీ (భూపాలపల్లి), ఫిబ్రవరి 9: అనారోగ్యంతో ఉన్న భార్యను ఆస్పత్రికి తీసుకొచ్చాడు ఓ వ్యక్తి. భోజనం చేయడానికి రోడ్డు దాటుతుండగా ప్రమాదానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. భూపాలపల్లిలో ఈ సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహదేవపూర్ మండలం కన్నెపల్లి గ్రామానికి చెందిన పిట్టల సారయ్య తన భార్యతో కలిసి మూడు రోజుల క్రితం భూపాలపల్లిలోని సురక్ష ఆస్పత్రికి వచ్చాడు. ఆమె అనారోగ్యంతో బాధపడుతుండగా ఈ ఆస్పత్రిలో అడ్మిన్ చేశాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి భోజనం చేసేందుకు ఆస్పత్రి ఎదుట రోడ్డు దాటుతుండగా కాటారం వైపు నుంచి పరకాల వైపు వెళ్తున్న ఇసుక లారీ అతడిని ఢీకొంది. దీంతో అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. రెండు కాళ్లు మాత్రమే కనిపిస్తూ శరీరమంతా ఛిద్రమై అవయవాలు రోడ్డుపై చిందరవందరగా పడ్డాయి. ఎస్సైలు శ్రావణ్‌కుమార్, శ్రీనివాస్ సంఘటన స్థలానికి చేరుకొని చెల్లాచెదురుగా పడి ఉన్న మృతదేహాన్ని తీయించి రోడ్డును క్లియర్ చేశారు. గుర్తుపట్టని విధంగా ఉన్న సారయ్య మృతదేహాన్ని చూసి భార్య, కుటుంబ సభ్యులు భోరున విలపించారు. మృతుడికి భార్యతో పాటు కుమార్తె ఉంది.

వాహనాలు తనిఖీ చేసిన సీఐ

కాటారం, ఫిబ్రవరి 9: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై, కాటారం-మంథని రోడ్డుపై పలుచోట్ల కాటారం సీఐ నాగార్జునరావు నేతృత్వంలో ఎస్సై అభినవ్ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం రాత్రి విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. ప్రతి వారం ఓ అధికారి ఆధ్వర్యంలో తనిఖీలు చేయాలనే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీఆర్‌పీఎఫ్ బలగాలు, సివిల్ పోలీసులతో కలిసి వాహనాల తనిఖీ చేశారు. వాహనాల తనిఖీతో పాటు పలువురు ఆటో డ్రైవర్లకు రహదారి భద్రత, కావాల్సిన సర్టిఫికెట్లపై సీఐ నాగార్జున్‌రావు అవగాహన కల్పించారు. మేడారం మహా జాతర నేపథ్యంలో వాహనాలను జాగ్రత్తగా నెమ్మదిగా నడపాలని సూచించారు.

పీఆర్‌టీయూ ఆవిర్భావ వేడుకలు

టేకుమట్ల, ఫిబ్రవరి 9: మండలంలోని రామక్రిష్టాపూర్(టీ) గ్రామంలోని మండల విద్యా వనరుల కేంద్రంలో శుక్రవారం పీఆర్‌టీయూ టీఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆ సంఘం ఆవిర్భావ వేడుకలు జరిగాయి. సంఘం జెండాను మండల అధ్యక్షుడు ఎమ్డీ. హకీం ఆవిష్కరించారు. మండల ప్రధాన కార్యదర్శి పప్పుల సునీల్, రాష్ట్ర నాయకులు మియాపూరం జగన్నాథం, తోట మహేందర్, మామిడి సురేష్ మండల నాయకులు స్వామి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

గట్టమ్మ ఎదురుపిల్ల పండుగ పోస్టర్ ఆవిష్కరణ

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 9: మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతరను పురస్కరించుకుని ములుగులోని ఆదివాసీ నాయకపోడ్ గట్టమ్మ పూజారులు ఎదురుపిల్ల పండుగ ఏర్పాట్లకు సన్నద్ధమయ్యారు. ములుగులో శుక్రవారం జరిగిన సమావేశంలో నాయకపోడ్ జిల్లా అధ్యక్షుడు, గట్టమ్మ ప్రధాన పూజారి కొత్త సురేందర్ మాట్లాడుతూ మాఘశుద్ధ రోజుల్లో ములుగు గట్టమ్మతల్లి దేవాలయం వద్ద ఎదురుపిల్ల పండుగ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆదివాసీ నాయకపోడ్ ఆచార సంస్కృతీ సంప్రదాయాలు ఇతర ఆదివాసీల సంస్కృతికంటే భిన్నంగా ఉంటాయని తెలిపారు. పాండవుల వంశంగా ఉన్న ఆదివాసీ నాయకపోడ్ కులస్థులు నేటికీ లక్ష్మీదేవర్ల ప్రతిమలతో పంచ పాండవులను పూజించడం ఆనవాయితీగా వస్తోందని అన్నారు. గట్టమ్మ పూజారుల ఆధ్వర్యంలో ఈనెల 14న ఎదురుపిల్ల పండుగ ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమవుతుందని, ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకపోడ్ సంస్కృతీ సంప్రదాయాలు కనువిందు చేసేలా ఉంటాయని అన్నారు. అనంతరం ఎదురుపిల్ల పండుగ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసమావేశంలో గట్టమ్మ పూజారులు కొత్త సదయ్య, లక్ష్మయ్య, ఆకుల మొగిలి, అరిగెల సమ్మయ్య, రాజు, అచ్చ రాజు, కొత్త రమేష్, పిట్టల మల్లేష్, రాజశేఖర్, కుమార్, స్వామి, కోట నరసింహం, చంద్రు, సారంగపాణి, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతర పనులు పూర్తిచేయాలి : సీపీఎం

వాజేడు, ఫిబ్రవరి 9: మేడారం జాతర పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సీపీఎంరాష్ట్ర కమిటీ సభ్యుడు బండారు రవికుమార్ డిమాండ్ చేశారు. మండపాకలోని ప్రైవేటు రిసార్టులో ఆ పార్టీ జిల్లా కమిటీ సమావేశం మండల కార్యదర్శి కొప్పుల రఘుపతిరావు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ మేడారం జాతర పనులను ఆలస్యంగా ప్రారంభించడంతో భక్తులకు ఇబ్బందులు తప్పేలా లేవని అన్నారు. ముఖ్యంగా పారిశుధ్యం, రహదారులు, తాగునీటి సరఫరా పనులను త్వరితగతిన పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కొంతమంది కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా ఇష్టారాజ్యంగా పనులను చేయిస్తున్నారని విమర్శించారు. తూతూమంత్రంగా పనులు చేపడుతూ కోట్ల రూపాయాలను కాంట్రాక్టర్లు, అధికారులు మింగేస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు సూడి కృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి, జిల్లా నాయకులు బీరెడ్డి సాంబశివ, రత్నం రాజేందర్, యండీ దావూద్, వంకా రాములు, చిట్టి బాబు, ఆగిరెడ్డి, చిరంజీవి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు విద్యార్థిని ఎంపిక



వెంకటాపూర్(రామప్ప), ఫిబ్రవరి 9: ఇటీవల జిల్లాస్థాయిలో ఆన్‌లైన్ విధానంలో జరిగిన ఇన్‌స్పైర్ వైజ్ఞానిక పోటీల్లో మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని బి.అక్షిత ప్రతిభ కనబరిచిం రాష్ట్రస్థాయికి ఎంపికైంది. ఈ మేరకు ప్రధానోపాధ్యాయురాలు రాధిక శుక్రవారం తెలిపారు. డ్రెయినేజీ పైపుల్లోకి పాములు, ఎలుకలు రాకుండా ఏవిధంగా అరిక ట్టాలో అక్షిత వివరించినట్లు పేర్కొన్నారు. ఈసందర్భంగా అక్షితను ప్రధానో పాధ్యాయురాలితోపాటు ఉపాధ్యాయులు కిరణ్, అంబేద్కర్ తదితరులు అభినందించారు.

సంక్షేమ పథకాలు కేంద్ర ప్రభుత్వానివే..

బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం

మంగపేట, ఫిబ్రవరి 9: రాష్ట్రంలో ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నది కేంద్రప్రభుత్వమేనని బీజేపీ ములుగు జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం అన్నారు. మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన పార్టీ మండల స్థాయి విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం ప్రధాని నరేంద్ర మోదీ కృషి చేస్తున్నారని అన్నారు. మరోసారి ఆయన ప్రధాని అయితే మరిన్ని పథకాలు అమలవుతాయన్నారు. ప్రజలు మరోసారి అవకాశం కల్పించాలని కోరారు. కార్యకర్తలు ఇందుకు కృషి చేయాలన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు లోడే శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ నాయకురాలు స్వరూప, జిల్లా ప్రధాన కార్యదర్శులు గాజుల కృష్ణగౌడ్, నగరపు రమేష్, బీజేఎంఎం జిల్లా అధ్యక్షుడు ఎమ్డీ. యాకూబ్‌పాషా, బీఎంఎస్ జిల్లా అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాసరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు రామిడి సురేష్, పాకనాటి వెంకట్‌రెడ్డి, యర్రంకారి వీరన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లింగ అసమానతలపై అవగాహన పెంపొందించాలి

మల్హర్, ఫిబ్రవరి 9 : లింగ అసమానతలపై అవగాహన పెంపొందించాలని ఎంపీపీ చింతలపల్లి మల్హల్‌రావు, మిషన్ శక్తి ఇన్‌చార్జి కో ఆర్డినేటర్ అనూష అన్నారు. మండలంలోని తాడిచర్ల హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన బేటీ బచావో.. బేటీ పఢావో కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. బాలబాలికలకు చట్టపరమైన హక్కులు కల్పించాలని, నాణ్యమైన విద్య, వైద్యం అందించాలని అన్నారు. బాల్యవివాహాలను అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ మాస్టర్ భాస్కర్‌రావు, సూపర్‌వైజర్ సరస్వతి, ఎల్‌సీపీవో మొహియొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా జాతర పనులు

మొగుళ్లపల్లి, ఫిబ్రవరి 9: ఈనెల 21 నుంచి 24వ వరకు జరిగే సమ్మక్క, సారలమ్మ జాతరను పురస్కరించుకుని మొగుళ్లపల్లి-ములుకలపల్లి గ్రామాల మధ్య గద్దెల పరిసరాల్లో అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. గద్దెల ప్రాంతంలో రూ.10లక్షలతో సీసీ రోడ్లు, ప్రహరీతోపాటు రూ.6 లక్షలతో మరుగుదొడ్లు, తాగునీరు తదితర పనులు కొనసాగుతున్నాయి. ముళ్ల పొదలు, చెత్తాచెదారాన్ని కూలీలు తొలగిస్తున్నారు.

నియోనటల్ కేర్ 108 సేవలపై అవగాహన

మహదేవపూర్ రూరల్, ఫిబ్రవరి 9 : ఎమర్జెన్సీలో చిన్న పిల్లలను అంబులెన్స్‌లో తరలించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నియోనటల్ కేర్ 108 అంబులెన్స్ సేవలపై మండల పరిధిలోని అంబట్‌పల్లి పీహెచ్‌సీలో శుక్రవారం అవగాహన కల్పించారు. చిన్నపిల్లలను అంబులెన్స్ తరలించేటప్పుడు ఎలాంటి పరికరాలు ఉంటాయో, వాటిని ఎలా ఉపయోగిస్తారో అంబులెన్స్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలకు 108 జిల్లా మేనేజర్ నరేష్ వివరించారు. 102, పార్థివ వాహనం సేవల గురించి కూడా వివరించారు. ఈకార్యక్రమంలో ఈఎంటీ తిరుపతి, పైలట్ ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై సర్వే

కాటారం, ఫిబ్రవరి 9: మండలంలోని 24 గ్రామపంచాయతీల పరిధిలో మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాల సర్వే ముమ్మరంగా సాగుతోంది. మండల, జీపీల ప్రత్యేకాధికారుల నేతృత్వంలో పంచాయతీ కార్యదర్శులు, విద్యుత్ అధికారులు, సిబ్బంది మహాలక్ష్మి, గృహజ్యోతి దరఖాస్తుదారుల ఇళ్లకు దరఖాస్తుఫారాలతో శుక్రవారం వెళ్లారు. ఆధార్, గ్యాస్, కరెంట్ మీటర్, రేషన్‌కార్డు నంబర్లను సేకరించారు. దరఖాస్తుల్లో పలువురు వివరాలను తప్పుగా నమోదు చేయడంతో పలు బృందాలు సర్వేలో పాల్గొని వాటిని సరిచేస్తున్నారు. సర్వేను మండల ప్రత్యేకాధికారి సంజీవరావు, ఎంపీడీవో శంకర్‌నాయక్, ఎంపీవో ఉపేంద్రయ్యతోపాటు పలువురు జీపీ ప్రత్యేకాధికారులు పర్యవేక్షించారు.

యువకుడి ఆత్మహత్య


మధుకర్ (ఫైల్)

కన్నాయిగూడెం, ఫిబ్రవరి 9 : క్రిమి సంహారక పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోగురువారం సాయంత్రం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, ఎస్సై ఎం. సురేష్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గుర్రేవుల గ్రామానికి చెందిన అగ్గు మధుకర్ (30) అవివాహితుడు. కొన్నేళ్ల క్రితం తండ్రి మృతి చెందగా కూలినాలి చేసుకుంటూ తల్లి అనసూర్యతో కలిసి జీవిస్తున్నాడు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులతోపాటు కుటుంబంలో పలు సమస్యలు ఉండటంతో మనస్తాపం చెంది గుర్రేవుల- భూపతిపూర్ రోడ్డు పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని గుర్తించిన ప్రయాణికులు గ్రామస్థులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే అతడు మృతి చెందాడు. తల్లి అనసూర్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్టు ఎస్సై తెలిపారు.

నేడు పీఏసీఎస్ చైర్మన్ ఎన్నిక

గణపురం, ఫిబ్రవరి 9: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ ఎన్నిక శనివారం జరగనుంది. గణపురం పీఏసీఎస్ చైర్మన్‌పై కమిటీ సభ్యులు ఐదురోజుల క్రితం డీసీవో శైలజ ఆధ్వర్యంలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టగా అది నెగ్గింది. ఈ క్రమంలో నూతన చైర్మన్‌ను ఎన్నుకోనున్నారు.

రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలకు విద్యార్థుల ఎంపిక


అభినందిస్తున్న అసోసియేషన్ అధ్యక్షుడు శ్యామ్, ఉపాధ్యాయులు

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 9: ఇటీవల హనుమకొండలో తెలంగాణ అమేచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో జరిగిన పోటీల్లో ములుగుకు చెం దిన విద్యార్థులు పాల్గొని అత్యుత్తమ ప్రతి భను చాటారు. రాష్ట్రస్థాయికి ఎంపిక య్యారు. శుక్రవారం ములుగులో జరిగిన కార్యక్రమంలో జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ అధ్య క్షుడు నూనేటి శ్యామ్ పాల్గొని విద్యార్థులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెజ్లింగ్ 50కిలోల విభాగంలో జాటోత్ చిన్ని పాల్గొని గోల్డ్‌మెడల్ సాధించిందని, 33కిలోల విభాగంలో రాజేశ్వరి, 36కిలోల విభాగంలో అంజలి, 42కిలోల విభాగంలో కె.అక్షయ, 46కిలోల విభాగంలో అశ్విని, 58కిలోల విభాగంలో రష్మిత తృతీయ స్థానం సాధించారని అన్నారు. జగ్గన్నపేట ఏహెచ్ఎస్ ప్రిన్సిపాల్ వేణుగోపాల్, కోచ్ కె.సతీష్, పీఈటీలు నాగభూషణం, రామచందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.